



అనకాపల్లిలోని ఒక బంగారం దుకాణంలో కొనుగోలుదారులు

ఎట్టకేలకు కరుణించిన వరుణుడు

పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

అనకాపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లి, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో గురువారం మధ్యాహ్నం తరువాత మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా కోటవురట్ల, నాతవరం మండలాల్లో ఈదురు గాలులతో కుండపోతగా వాన పడింది. అనకాపల్లి, కశింకోట, సబ్బవరం, బుచ్చెయ్యపేట, నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, చోడవరం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అనకాపల్లిలో 18.8 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్టు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు. రహదారులు జలమయం అయ్యాయి. పొలాల్లో నీరు చేరింది. కొద్ది రోజుల నుంచి నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న వరినారుమళ్లకు జీవం పోసిందని అన్నదాతలు అంటున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం చెందారు.





కోటవురట్లలో భారీ వర్షంతో పంట కాలువను తలపిస్తున్న నర్సీపట్నం- అడ్డరోడ్డు ప్రధాన రహదారి. (ఇన్‌సెట్‌లో) లింగాపురంలో వరినారుమడిలోకి చేరిన వర్షం నీరు

మార్కెట్‌లో శ్రావణ సందడి

వరలక్ష్మీవ్రత కొనుగోళ్లతో రద్దీగా దుకాణాలు

శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో వివిధ రకాల వస్తువులు, పూలు, పండ్లు కొనుగోలు కోసం ప్రజలు గురువారం మార్కెట్ల దారి పట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో అనకాపల్లి మెయిన్‌రోడ్డు రద్దీగా మారింది. బంగారం, దుస్తులు, పండ్లు, పూలు, కొబ్బరికాయలు విక్రయించే దుకాణాలకు కొనుగోలుదారులు పోటెత్తారు. సాధారణ రోజులతోపోలిస్తే పండ్లు, పూలు, కొబ్బరికాయల ధరలు 25-50 శాతం వరకు అధికంగా వున్నట్టు చెబుతున్నారు.

అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



రద్దీగా ఉన్న కొబ్బరికాయల మార్కెట్

ఉచిత ప్రయాణానికి బస్సుల కొరత

అనకాపల్లి డిపోలో రెండు సర్వీసులే ఎక్స్‌ప్రెస్‌లు

- 95 శాతం పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు
- ఇవి ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు విజయనగరం వరకే పరిమితం
- అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాని ఇతర డిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మరో వారం రోజుల్లో కల్పించనున్న ఉచిత ప్రయాణ సదుపాయం జిల్లాలోని మహిళలు పూర్తిస్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేకపోయింది. ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ప్రభుత్వం చెప్పగా, అనకాపల్లి మహిళలకు మూడు రకాల బస్సులు మాత్రమే అందుబాటులో వున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'ఆర్టీసీ బస్సులల్లో మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. కండక్టర్‌కు రేషన్‌కార్డు/ ఓటర్ ఐడీ/ ఆధార్‌కార్డుల్లో ఏదో ఒకదానిని చూపితే చాలు. కండక్టర్ 'జీరో' టికెట్ జారీ చేస్తారు. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే జిల్లా కేంద్రమైన అనకాపల్లి డిపోకు చెందిన బస్సులు అనకాపల్లి, అలూరి సీతారామరాజు, విశాఖ, విజయనగరం జిల్లాలకు మాత్రమే నడుస్తున్నాయి.

అనకాపల్లి డిపోలో మొత్తం 98 బస్సులు ఉన్నాయి. వీటిలో 56 బస్సులు సంస్థకు చెందినవి కాగా 42 బస్సులు అద్దెవి. సంస్థ బస్సుల్లో ఐదు మాత్రమే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. 13 మెట్రో సర్వీసులు, ఐదు సిటీ ఆర్డనరీ, 33 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. అద్దె బస్సుల విషయానికి వస్తే తొమ్మిది మెట్రో సర్వీసులు, రెండు సిటీ ఆర్డినరీ, 31 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. అనకాపల్లి నుంచి పలాస, పర్లాకిమిడికి నడిచే ఎక్స్‌ప్రెస్‌లు మినహాయిస్తే మిగిలిన బస్సులు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు పక్కనే వున్న విజయనగరానికి నడుస్తున్నాయి. ఇవి కూడా మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ బస్సులే కావడం గమనార్హం. అనకాపల్లి నుంచి పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, గజపతినగరం, పాలకొండ, రాజాం, ఇచ్ఛాపురం, తదితర ప్రాంతాలకు వెళ్లడానికి అనకాపల్లి నుంచి నేరుగా బస్సు సదుపాయం లేదు. ఇక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి అందుబాటులో వున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆశ్రయించాలి.

కాగా ఇతర జిల్లాలు/ డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో అత్యధిక శాతం జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయే తప్ప అనకాపల్లి కాంప్లెక్స్‌లోకి రావడంలేదు. దూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే జాతీయ రహదారిలోని పూడిమడక జంక్షన్‌కు వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కాలి. పట్టణంలో నుంచి పూడిమడక జంక్షన్‌కు రాకపోకలకు పగటిపూట ఇబ్బంది లేకనప్పటికీ, రాత్రిపూట ఇక్కడ బస్సు దిగిన ప్రయాణికులు ... మిగతా 8వ పేజీలో



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పల్లె వెలుగు బస్సులు

ఆక్వా రంగానికి ఊతం!

రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో ప్రత్యేక జోన్‌లు

- 172.68 ఎకరాలను గుర్తించిన మత్స్య శాఖ
- రొయ్యలు, చేపల పెంపకం చేపట్టే రైతులకు విద్యుత్‌పై సబ్సిడీ



ఎస్.రాయవరం మండలం వాకపాడులో రొయ్యల చెరువులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగం అభివృద్ధికి, తద్వారా ఆయా రైతులకు ప్రయోజనం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాలోని రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో కొత్తగా మూడు ఆక్వా జోన్లను ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం మూడు మండలాల్లో మొత్తం 172.68 ఎకరాలను మత్స్యశాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు నాన్-ఆక్వా జోన్‌లో వున్న ఈ భూములను ఆక్వా జోన్‌లోకి మారుస్తారు. ఆక్వా జోన్లలో రొయ్యలు, చేపల పెంపం చేపట్టే రైతులకు ప్రభుత్వం విద్యుత్‌పై రాయితీ ఇస్తుంది.

గత వైసీపీ ప్రభుత్వం ఆక్వా రంగానికి చేయూత ఇవ్వకపోగా, మరిన్ని ఇబ్బందులకు గురిచేసింది. చేపలు, రొయ్యల పెంపకందారుల్లో కొద్దిమందికి మాత్రమే విద్యుత్ సబ్సిడీని అమలు చేసింది. మిగిలిన రైతులకు విద్యుత్ బిల్లుల భారం విపరీతంగా పెరిగిపోయి, ఆర్థికంగా నష్టపోయారు. దీంతో పలువురు రైతులు రొయ్యలు, చేపల పంపెకాన్ని విరమించుకున్నారు. ఈ నేపథ్యంలో 2023లో 'యువగళం' పాదయాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత రాష్ట్ర మంత్రి అయిన నారా లోకేశ్ పాయకరావుపేటలో ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలు, ఇబ్బందులు చెప్పుకున్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. అంతేకాక ఆక్వా రంగం అభివృద్ధికి కొత్త జోన్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో మత్స్య శాఖ గుర్తించిన 172.68 ఎకరాల్లో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయనున్నారు. వీటిని మూడు జోన్లుగా విభజిస్తారు. ఆయా జోన్‌లలో రొయ్యలు, చేపల పెంపకం చేపట్టే రైతులకు విద్యుత్ రాయితీ లభిస్తుంది. జిల్లా మత్స్య శాఖ అధికారి విజయ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో గ్రామ సభలు నిర్వహించి ఆక్వా రైతుల అభిప్రాయాలను సేకరించారు. తాజాగా కలెక్టర్ విజయకృష్ణన్ మత్స్య, వ్యవసాయ, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఆక్వా జోన్‌లలో రొయ్యలు, చేపల పెంపకం, రైతులకు అందించే ... మిగతా 8వ పేజీలో

చేనేతలకు ప్రభుత్వం అండ

కార్మికులను ఆదుకోవడానికి పలు పథకాలు, రాయితీలు

- చేనేత ఉత్పత్తుల గ్లోబల్ మార్కెటింగ్‌కు కృషి
- కలెక్టర్ విజయకృష్ణన్

అచ్యుతాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని, దీనిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు, రాయితీలు అమలు చేస్తున్నాయని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, భారతదేశ చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తుందని చెప్పారు. జిల్లాలో 2,593 చేనేత కార్మికులకు ప్రతినెలా పెన్షన్లు అందిస్తున్నాయని తెలిపారు. నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద పాయకరావుపేట క్లస్టర్‌లో మగ్గాలు, జాక్వార్డ్ లిఫ్టింగ్ పరికరాలు, సోలార్ లైటింగ్స్, వర్క్‌షెడ్‌ల కోసం 87 మంది చేనేత కార్మికులకు మొదటి విడత రూ.48.78 లక్షలు అందజేసినట్టు ఆమె తెలిపారు. చేనేత ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, చేనేత వస్త్రాలకు పలుదేశాల్లో ఆదరణ పెరుగుతున్నదని, కార్మికులు వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సత్కరించారు. చేనేత సంఘం నాయకుడు పప్పు రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసి నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు, ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ, మాజీ ఎంపీ చలపతిరావు. పక్కన కలెక్టర్ విజయకృష్ణన్



నూకాంబిక అమ్మవారిని వివిధ రంగుల గాజులతో అలంకరించిన దృశ్యం

గాజుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

కశింకోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని గురువారం తాళ్లపాలెంలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, నక్షత్ర హారతి, మంత్రపుష్పం, పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్టు అర్చకులు మధిర శ్రీరామమూర్తి, ఫణి తెలిపారు.





రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం. (ఇన్‌సెట్‌లో) చెట్టు మొదలు

ఎలమంచిలిలో కూలిన భారీ వృక్షం

ముప్పు నుంచి త్రుటిలో తప్పించుకున్న స్థానికులు

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట, ప్రధాన రహదారి పక్కన వున్న భారీ వృక్షం గురువారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. సుమారు 11 గంటల సమయంలో జరిగిన ఈ హఠాత్‌పరిణామంతో అక్కడ వున్న వారు భయాందోళన చెందారు. చెట్టు కూలేటప్పుడు శబ్దం రావడంతో దాని కింద వున్న వారు దూరంగా పరుగెత్తారు. ఎవరికీ ముప్పు వాటిల్లకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. చెట్టు కింద వున్న నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వల్పంగా దెబ్బతిన్నాయి. కాగా రోడ్డుకు అడ్డంగా చెట్టు పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు స్పందించి, ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్టును తొలగింపజేశారు. సుమారు 50 ఏళ్ల క్రితంనాటిన మొక్క.. మహావృక్షంగా ఎదిగింది. అయితే చెట్టు మొదలు వద్ద చెద పట్టడంతో బలహీనంగా మారి కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

అవినీతి అనకొండ

విజయవాడలో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం విశాఖపట్నం ఎస్ఈ శ్రీనివాస్



ఎస్ఈ శ్రీనివాస్

- ఈఎన్‌సీ కూడా ఆయనే...
- ఏ ప్రభుత్వం ఉన్నా ఆయనదే హవా
- బిల్లు మంజూరు చేయాలంటే కాంట్రాక్టర్లు ఒక శాతం ముందే ముట్టజెప్పాలి
- నెలాఖరుకు పదవీ విరమణ
- ఈలోగా రూ.ఐదు కోట్ల వసూళ్ల లక్ష్యం...సిబ్బందిపై ఒత్తిడి
- ఆ నేపథ్యంలోనే ఏసీబీకి దొరికిన వైనం



ఉషోదయ జంక్షన్‌లో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ కార్యాలయం

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):

విజయవాడలో రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఎ.శ్రీనివాస్ విశాఖపట్నం సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన అక్రమాల గురించి సిబ్బంది, కాంట్రాక్టర్లు ఇప్పుడు పెదవి విప్పుతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఈఈ వరకూ ప్రతి ఒక్కరూ ఆయన వేధింపులకు గురైనవారేనని అంటున్నారు.

నగరంలోని ఉషోదయ జంక్షన్ సమీపాన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఉంది. అక్కడ ఎస్ఈగా ఉన్న శ్రీనివాస్ ఏ ప్రభుత్వం వచ్చినా ఉన్నతాధికారుల నుంచి ప్రజా ప్రతినిధుల వరకూ ప్రతి ఒక్కరినీ మచ్చిక చేసుకుని చక్రం తిప్పారు. గత ప్రభుత్వంలో తన సామాజిక వర్గానికి చెందిన మంత్రి అండదండలతో హవా నడిపిన ఆయన...కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒకే సామాజిక వర్గమంటూ ఒక మంత్రికి దగ్గరయ్యారు. విశాఖలో ఎస్ఈగా, విజయవాడలో ఈఎన్‌సీగా... రెండు పోస్టుల్లో తానే కొనసాగేలా చక్రం తిప్పారు. విభాగంలో తనకు ఎవరు పోటీ ఉండకూడదని కుట్రతో తనతోపాటు డీఈగా పదోన్నతి పొందిన అధికారిపై లేనిపోని ఫిర్యాదులు చేశారు. ఆ అధికారి ఇప్పటికీ డీఈగానే ఉండగా, శ్రీనివాస్ మాత్రం ఈఈ, ఎస్ఈ, సీఈ, చివరకు ఈఎన్‌సీ వరకూ పదోన్నతులు పొందారు. గత ప్రభుత్వంలో తనకున్న పలుకుబడి ... మిగతా 8వ పేజీలో

సీతాఫలాల ధరలు అంతంతే!

కోనాం సంతలో కావిడి పండ్లు రూ.650-850

- గిట్టుబాటు ధర లభించలేదని గిరిజనుల ఆవేదన



కోనాం సంతలో విక్రయానికి తెచ్చిన సీతాఫలాలతో గిరిజనులు - 8లో

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా : ఏడీఏ

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా అవుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.ఉమాప్రసాద్ అన్నారు. మండలంలోని సత్యవరంలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులపై మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంలో వాతావరణ కాలుష్యం ఉండదన్నారు. ఆరోగ్యకరమైన, విషరహితమైన నాణ్యమైన పంటలు చేతికి అందుతాయన్నారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది భవాని ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు, జీవామృతం, వేప గింజల కషాయం తయారీ, వాటి వలన ఉపయోగాలు, కషాయాలతో తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో పి. ఆదినారాయణ, ఏఈఒ నాగమణి , ఆత్మ సిబ్బంది పి.సత్యవేణి, సర్పంచ్ సఖిలేటి రాము, ఎంపీటీసీ సభ్యుడు తమిర్సి సత్యనారాయణ, నేతలు యగదాసు శేఖర్, ఏనుగు చిన్నా, రైతులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుతో ప్రజలకు మరణ శాసనం

▸▸ డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్

పాయకరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో ఈప్రాంత ప్రజల జీవితాలకు మరణ శాసనం తప్పదని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయదలచిన బల్క్‌డ్రగ్ పార్కు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న ఆందోళనలను రాష్ట్రప్రభుత్వం, హోంమంత్రి పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లతో కుమ్మకై ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీబీపీ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్, శామ్యూల్ జాన్సన్ పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

నక్కపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన దొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో గురువారం రవీంద్రనాథ్ ఠాగూర్ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.జనార్దన్, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకులు యేడిద వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.







మార్కెట్‌లో శ్రావణ సందడి

వినియోగదారులతో కిటకిట... ధరలపై మండిపడిన మహిళలు

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మార్కెట్‌లో శ్రావణ మాసం సందడి నెలకొంది. శ్రావణ శుక్రవారం పూజలు చేసుకునేందుకు అవసరమైన పువ్వులు, పండ్లు, పత్రి, తదితర వస్తు సామగ్రిని కొనుగోలు చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. ప్రధాన రోడ్డు వెంబడి దుకాణాలు లేకుండా మునిసిపల్, పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ప్రధాన రోడ్డు వెంబడి ఆక్రమణలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. పువ్వులు దగ్గర్నుంచి పండ్లు, ఫ్యాన్సీ, వస్త్రాల ధరలన్నీ వినియోగదారులకు చుక్కలు చూపించాయి. మార్కెట్లో వస్తు సామగ్రిపై ధరల నియంత్రణ లేకుండా పోయింది. వ్యాపారుల తీరుపై పలువురు మహిళలు మండిపడ్డారు. ధరలు నియంత్రించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ప్రధాన రోడ్డు



చుక్కలను తాకిన చామంతుల ధర

నక్కపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో గురువారం చామంతి పూల ధరలు చుక్కలను తాకాయి. ఎలమంచిలిలో డజను చామంతి పూలు గురువారం రాత్రి రూ.100లకు విక్రయించారు. మరికొందరు కిలో చామంతులు రూ800లకు విక్రయించారు. గతంలో కిలో రూ. 400 ధర పలికిన చామంతుల ధర ఒక్కసారిగా రెట్టింపయింది.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తా

శ్రీరాంపురం సొసైటీ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి అనిత సహకారంతో పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీరాంపురం సొసైటీ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చిక్కాల శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా రావాడ గోవింద రెడ్డి, పల్లెల సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలను పారదర్శకంగా అందించడంలో పూర్తి సహకారం అందిస్తామన్నారు. చైర్‌పర్సన్, డైరెక్టర్లను నియోజకవర్గ కూటమి నాయకులు తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలు, గొర్లె రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు ఆనంద్, మణికంఠ స్వామి, గొల్లపల్లి నాగు, గణపర్తి రాజబాబు, గణపర్తి దొరబాబు, కలిదిండి సతీష్‌రాజు, సర్పంచులు గారా కృష్ణప్రసాద్, పి. అప్పలనర్స, కంచి మాణిక్యం అభినందించారు.



పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన చిక్కాల శ్రీనివాసరావును అభినందిస్తున్న కూటమి నాయకులు

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

రోజురోజుకు పెరుగుతున్న బాధితులు

రాంబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు, అధిక ఎండలతో గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రజలాయి. ప్రతీ ఇంట్లో జ్వర బాధితులు ఇబ్బంది పడుతున్నారు. రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు వైరల్ జ్వరాలకు గురై మంచాన పడ్డారు.ఇప్పటికే జ్వరాల తీవ్రతతో ఆసుపత్రుల్లో చేరిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జ్వరం, ఒళ్ళు నొప్పులు, జలుబు, దగ్గు, వంటి లక్షణాలతో రోగులు ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటిలోను జ్వరపీడితులు ఉన్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి ఉన్నవారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వైద్యసేవలు పొందుతున్నారు. పేదలు ప్రభుత్వ ఆసుపత్రులు, ఆర్ఎంపీ డాక్టర్ల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు. రోజుల తరబడి జ్వరం వదలడం లేదని రోగులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా సరైన వైద్యసదుపాయాలు అందకపోవడంతో అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నామని పలువురు రోగులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నిరసన

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించిన ప్రభుత్వ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు గురువారం పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్ మణికంఠ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ప్రతినిధులకు అనుమతిలేదని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు లక్ష్మణ్, అజయ్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

నక్కపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపుసంత హైవే వద్ద గురువారం సాయంత్రం పెనుప్రమాదం తప్పింది. విజయనగరానికి చెందిన ఒక కుటుంబం బుట్టాయిగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా, నక్కపల్లి వారపుసంత హైవే వద్ద లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు లారీ ముందుకు వచ్చి ఆగిపోయింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, కారులో వున్న ఐదుగురు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కోటవురట్లలో కుండపోత

కోటవురట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గురువారం కుండపోత వర్షం కురిసింది. గురువారం 67.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అనంతరం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి చేరుతుంది. సుమారు గంటన్నరపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షానికి పంట పొలాల్లో చేరింది. ఈ వర్షం వరినారు మడులకు జీవం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోటవురట్లలో రహదారులు జలమయమయ్యాయి. ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా నీరు నిలిచిపోయింది. కోటవురట్లలో 67.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహశీల్దార్ తిరుమలబాబు తెలిపారు.



ఎంపీడీవో ఆఫీసు వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు

నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ: సుందరపు

అచ్యుతాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అయిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం కొండకర్లకు చెందిన 200 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అచ్యుతాపురంలో గల ఎమ్మెల్యే విజయకుమార్ ఇంటి వద్ద జనసేన పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలుపై నమ్మకంతో వైసీపీని వీడుతున్నారన్నారు. కొండకర్లకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులు కోట్ని శివ, శ్రీను, చంద్రశేఖర్, రమణ, అప్పలరాజు, శేఖర్, దేవి, వెంటరావు, రామసీత, కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయకుమార్

మేలుపాక హెడ్ రెగ్యులేటర్ పనులు ప్రారంభం

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 7, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.జగన్నాథపురంలో ఏషియన్ పెయింట్స్ సహకారంతో మేలుపాక హెడ్ రెగ్యులేటర్ పనులను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులతో ఈ పథకాన్ని ఏడాదిలో పూర్తి చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరెడ్ల బుల్లెమ్మ, జనసేన నాయకులు కరెడ్ల సూర్య ప్రకాష్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు పునర్జీవం

మునగపాక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన సాగునీటి కాలువలకు కూటమి ప్రభుత్వం పునర్జీవం పోస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలో కుమారపురం గ్రామంలో రూ.15.34లక్షలు సీఎస్ఆర్ నిధులతో రేలుగెడ్డ సాగునీటి కాలువపై నిర్మించిన రెగ్యులేటర్ పునరుద్ధరణ పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వారం రోజులు పాటు నిర్వహించిన తల్లి పాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా లైను కొత్తూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఏసీడీపీవో ఎంపీ రమణికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలన్నారు. బిడ్డకు, బిడ్డకు ఎడమ ఉండాలన్నారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ప్రధాన రోడ్డు వరకూ ర్యాలీ నిర్వహించిన తల్లిపాల ఆవశ్యకతను స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీ బి. డేవిడ్, సూపర్‌వైజర్లు, ఎంఎస్‌కెలు, సిబ్బంది పాల్గొన్నారు.



లైనుకొత్తూరులో తల్లిపాల వారోత్సవాల ముగింపు ర్యాలీలో పాల్గొన్న ఏసీపీవో ఎంపీ. రమణికుమారి

అచ్యుతాపురంలో..

తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రశాంతి విద్యాసంస్థలు, కైట్ కళాశాల విద్యార్థులు గురువారం భారీ ర్యాలీని నిర్వహించారు. ముందుగా విద్యార్థులు కళాశాలల నుంచి ర్యాలీగా అచ్యుతాపురం జంక్షన్‌కి వచ్చారు. అక్కడ మానవహారంగా ఏర్పడి తల్లి పాలు ఆవశ్యకతను వివరించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య, వైద్యాధికారులు వెంకట్, సుధీర్, కైట్స్ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

గర్భిణులు,బాలింతలు సరైన పోషకాహారాన్ని తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుంటారని టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల గురించి సీడీపీవో శ్రీవిద్య, సూపర్ వైజర్లు లలిత, సత్యవతి, నిషా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పైబోయిన రమణ, గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్

పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ శనివారం ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా పలు మండలాల్లోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపిస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎలమంచిలి మండల పరిధిలో ఎలమంచిలి పట్టణం,(ఏజీఎల్), కొత్త యర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో(ఏజీఎల్), నక్కపల్లి మండలంలో గొడిచెర్ల, ఉద్దండపురం, చేరిక కొత్తూరు, జానకయ్యపేట, చిన్న రామభద్రపురం, వేంపాడు, గుల్లిపాడు, దేవవరం, ఒట్టుమెట్ట, గుంటపల్లి, నామవరం, ఎస్.రాయవరం మండలంలో ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, పెట్టుగోల్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, పెద్దబోదిగల్లం, రామకృష్ణాపురం, పెద్ద దొడ్డుగల్లు, సీతమ్మపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

పాయకరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని పాయకరావుపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార సొసైటీ ఆవరణలో సమావేశం నిర్వహించిన అనంతరం చేనేత కార్మికులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మలిపెద్ది వెంకటరమణ, తదితరులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజరు గేరు వీరనాగేశ్వరరావు, చేనేత కార్మిక నాయకులు కర్ర వీరవెంకటేశ్వరరావు, బళ్ల దొంగబాబు, కొమ్మన వెంకటేశ్వరరావు, కాలెపు వీరభద్రరావు, గేరు భద్రం పాల్గొన్నారు.

కబడ్డీ కప్ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లిలో ఈనెల 18వ తేదీ నుంచి మూడు రోజులు పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఎమ్మెల్యే కప్ పోస్టర్‌ను కూటమి నేతలు ఆవిష్కరించారు. గురువారం అచ్యుతాపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ క్యాంపు కార్యాలయంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల అధికార ప్రతినిధి సుందరపు వెంకట సతీష్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్టూరులో కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

అచ్యుతాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో కాలువ నిర్మాణ పనులు ప్రారంభించామని సర్పంచ్ కేకే రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుకు ఎమ్మెల్యే రూ.30 లక్షలు కేటాయించారని,తొలుత కాలువల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీఎస్ రాజు, ఏఓ రమణరాజు, ఎంఈఓ సూర్యారావు, వైద్యాధికారులు డాక్టర్ సీహెచ్ దీపిక, డాక్టర్ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడితే గుర్తింపు గ్యారంటీ : ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 7, (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికి గ్యారంటీగా గుర్తింపు లభిస్తుందని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం మల్లవరం పంచాయతీలో జరిగిన బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మల్లవరంలో అధికారం కోసం కొందరు నాయకులు పార్టీ మారారని, వారు పెద్దలు కాదని, గెద్దలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిన్నమరాజు రవీంద్ర రాజు, లాలం రాము, దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, మారిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు జెర్సీలు వితరణ

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని 18 మంది హాకీ క్రీడాకారులకు పట్టణానికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారుడు గదుల సత్యనారాయణ జెర్సీలను వితరణగా అందజేసినట్టు హాకీ అసోసియేషన్ ప్రతినిధి కొఠారు నరేష్ గురువారం తెలిపారు. గదుల నాగమణి జ్ఞాపకార్థం వీటిని సత్యనారాయణ క్రీడాకారులకు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి అప్పారావు, స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

9 నుంచి శ్రీప్రకాష్‌లో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీలు

పాయకరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. మూడు రోజుల పాటు అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహించే ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 1,800 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

పాయకరావుపేట పీహెచ్‌సీలో బేబీ ఫీడింగ్ సెంటర్

పాయకరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట పీహెచ్‌సీలో గురువారం బేబీ ఫీడింగ్ సెంటర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే తల్లులు, బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు సౌకర్యవంతంగా ఉండేందుకు ప్రత్యేక రూమ్ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.సౌందర్య, ఎంపీహెచ్ఈఓ డి.నెహ్రూ, హెచ్ఎస్ నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్త కె.లలిత పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం'



లైనుకొత్తూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను అన్నారు. గురువారం మండలంలోని లైనుకొత్తూరులో టీడీపీ నేత రాజాన నారాయణమ్మ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఇంటింట తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు, శ్రీను మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొలగాని నాగేశ్వరరావు, టీడీపీ నేతలు గుప్తా, నూకరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన డైట్ లెక్చరర్

కోటవురట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం భీమిలి డైట్ కళాశాల లెక్చరర్ ఎం.ఆనందరాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం విద్యార్థులు చదవడం, రాయడం, సంఖ్యలను గుర్తించడం, తెలుగు, ఇంగ్లీష్, గణితం పాఠ్యాంశాలపై సంస్థితపై తగు శ్రద్ధ చూపాలని ఆయా టీచర్లకు ఆయన సూచించారు. పాఠశాల హెచ్ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయండి

నక్కపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని మండల ప్రత్యేకాధికారి విజయ, ఎంపీడీవో డీ సీతారామరాజు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణా దినోత్సవ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో తలెత్తిన రైతుల సమస్యలను పరిష్కరించాలి

▸ ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే 'పంచకర్ల' సూచన



జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో జరిగిన అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి, ప్రస్తుతం జరుగుతున్న విశాఖపట్నం- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాల కారణంగా రైతులకు తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులకు సూచించారు. చిన్నయ్యపాలెం వద్ద జాతీయ రహదారుల భూ సేకరణ ఎస్‌డీసీ జ్ఞానవేణి, జాతీయ రహదారుల అభివృద్ధి కమిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్, విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే వద్ద సైట్ ఇంజనీర్లు, రైతులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో పండే పంటలను ఇళ్లకు తెచ్చుకునేందుకు అవసరమైన అండర్ పాత్ వేలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు తన దృష్టికి తీసుకు వచ్చినట్టు చెప్పారు. అలాగే, పంట పొలాలకు వెళ్లే నీరు, వరద నీరు, చిన్నయ్యపాలెం మేఘాద్రి గెడ్డ వద్ద డైవర్షన్ కాలువ పనులు వంటి వాటిపై అధికారులో చర్చించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వరద నీరు రోడ్లపై ప్రవహించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ చిన్నికృష్ణ, స్థానిక నాయకులు బోకం స్వామినాయుడు, కేవీ సత్యనారాయణ, శింగంపల్లి శ్రీను, బలిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు : పీలా



సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందిస్తున్న పీలా

తుమ్మపాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను పలువురికి అందజేసి మాట్లాడారు. పార్టీకి సేవలందిస్తున్న వారికి నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నాయకులు పచ్చికూర రాము, కర్రి బాబి, కాయల మురళీ, నారాయణరావు, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

42 మంది యువకులు రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వైఎంవీఏ హాల్‌లో గురువారం డొక్కా సీతమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అశ్విన్, తేజ స్నేహితుల జ్ఞాపకార్థం ఏర్పాటైన ఈ శిబిరంలో 42 మంది యువకులు రక్తదానం చేశారు. తొలుత సర్వజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరమేష్ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి అమ్మ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు పౌష్టికాహారం అందజేశారు.సంస్థ ప్రతినిధులు మడపాల ధనుష్, ఆడాడ వంశీ, మందపల్లి నాని, బండి దేవ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ సేవలపై అవగాహన

తుమ్మపాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ బ్యాంక్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ విశాఖ జోనల్ హెడ్ షాలీనీ మీనన్ కోరారు. గురువారం గుండాల వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అతి తక్కువ ప్రీమియంతో రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ పాలసీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బ్యాంక్ ద్వారా రుణాలను అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు ఎం.సత్యనారాయణ, ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ

సబ్బవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరిపాక శివారు చినయాతపాలేనికి చెందిన శరగడం వెంకటేశ్‌కు ట్రై సైకిల్ ఇస్తానని ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు దివ్యాంగుడైన అతనికి ఇక్కడి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే అందజేయడంతో అతడి ఆనందానికి అవధులు లేవు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శరగడం రాము, ఆడారి వెంకట్, కాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం

▸ కృతజ్ఞతలు తెలిపిన టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాబర్



జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాబర్

కశింకోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : హజ్ యాత్రికులకు ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందదాయకమని టీడీపీ అనకాపల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్య క్షుడు షేక్ బాబర్ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లా డుతూ ఈ ఏడాది హజ్‌యాత్ర కోసం 72 మంది విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకున్నారన్నారు. వారందరికీ లక్ష రూపాయల చొప్పున వారి ఖాతాల్లో రూ.72 లక్షలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, వచ్చే ఏడాది హజ్ యాత్రకు వెళ్లే ప్రతి ముస్లింకు రూ.లక్ష ప్రభుత్వం నుంచి అందజేయనున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో హజ్ హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేశారని ఆయన వివరించారు.

పీ-4పై విస్తృతంగా అవగాహన

▸ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

▸ ఎరువులపై పర్యవేక్షణ పక్కాగా ఉండాలని ఆదేశించిన విజయానంద్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఎరువులపై పర్యవేక్షణ పక్కాగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల అవసరాలను ముందుగా గుర్తించాలన్నారు. పీ-4 మార్గదర్శి, బంగారు కుటుంబాల అనుసంధానం అంశాలను పూర్తి చేయాలని సూచించారు. పీ-4 హ్యాండ్‌బుక్‌లోని సూచనలను పాటిస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నామని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ ఆయనకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి సీపీవో జి.రామారావు, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర శాఖల అధికారులు

షెడ్ నెట్స్‌పై రైతులకు వివరించండి

▸ కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : షెడ్ నెట్స్‌పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం షెడ్ నెట్స్‌పై ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, కేతి టెక్ కంపెనీతో ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్ నెట్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలానికి పదిమందిని ఆసక్తిగల వారిని గుర్తించి ఈ నెల 18వ తేదీలోపు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు జాబితాను సమర్పించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన శాఖల అనుసంధానంతో షెడ్ నెట్‌ను రైతులకు వేయించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారి శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో భారీ వర్షం

▸ అనకాపల్లిలో పలు రోడ్లు జలమయం

▸ రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు

▸ సబ్బవరంలో నలభై నిమిషాలు కుండపోత



భారీ వర్షానికి సబ్బవరం ప్రధాన రోడ్డుపై నిలిచిన నీరు



సబ్బవరం/అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం సబ్బవరం మండలంలో కుండపోతగా, అనకాపల్లి మండలంలో మోస్తరుగా వర్షం కురిసింది. వానా కాలం అయినప్పటికీ గత పదిహేను రోజులుగా వరుణుడి కరుణ కరువైంది. దీనికితోడు వేసవిని తలపించేలా ఎండలు మండుతుండడంతో జనం ఉష్ణతాపానికి గురయ్యారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి మూడు గంటల వరకు రోడ్లపై జన సంచారం పెద్దగా ఉండేది కాదు. ఇక రైతులైతే వరినారు పోసి వర్షం కోసం ఎదురు చూపులు చూసేవారు. కొందరు గత్యంతరం లేక బిందెలు, కావిడ్లతో నీటిని తోడుకొని వచ్చి నారుమడికి తడులు అందించేవారు. ఇటువంటి తరుణంలో గురువారం ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం వర్షం ఆరంభమైంది. సబ్బవరంలో సుమారు నలభై నిమిషాలపాటు కుండ పోతగా పడింది. పల్లపు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. ఉదయం నుంచి ఉష్ణతాపంతో అల్లాడిన జనం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఇదిలావుంటే, అనకాపల్లిలో 18.8 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలోని మార్కెట్లకు వచ్చినవారితో పాటు పూలు, పండ్లు, కొబ్బరికాయలు తదితర పూజా సామగ్రి విక్రయించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు రహదారుల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు భారీగా నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు బాలభారతి స్కూల్ విద్యార్థినులు



విద్యార్థినుల అభినందనలో ప్రిన్సిపాల్ వాసంతిదేవి

పరవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చీరాల డీఆర్ఎస్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఇక్కడి బాలభారతి స్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెలెక్షన్ పోటీల్లో ట్రయథ్లాన్‌లో శరణ్యారెడ్డి, పరుగు పందెంలో బి.సంధ్యారాణి, షాట్‌పుట్‌లో డి.ధనహర్షిణి ప్రతిభ చూపడంతో అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు సెల్టన్ జేమ్స్ తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని ప్రిన్సిపాల్ వాసంతిదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

'బల్క్‌డ్రగ్ పార్కు నిర్మాణ యోచన విరమించుకోవాలి'

తుమ్మపాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల జీవనానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు యోచనను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల అభిప్రాయాలను అంగీకరించాలని కోరారు.

మేయర్ దృష్టికి అనకాపల్లి సమస్యలు



మేయర్‌ను సత్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు గురువారం ఇక్కడున్న గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇంటికి విచ్చేశారు. తొలి సారిగా తన ఇంటికి వచ్చిన మేయర్‌ను సురేంద్ర సత్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో ఉన్న పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. త్వరలోనే ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని మేయర్ వివరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పరవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బీసీ కాలనీలో గల మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు నాయుడుపాలెం గ్రామానికి చెందిన స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి కూండ్రపు నరసింహమూర్తి నోట్ పుస్తకాలను సమకూర్చారు. వీటిని పరవాడ సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, సాయి శైలజా, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా అప్పారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల వేట పేరుతో తిరుగుతూ వ్యవసాయ మోటార్ల వైర్ల కత్తిరింపు

▸ ముగ్గురిని అరెస్టు చేసిన కశింకోట పోలీసులు

▸ వివరాలు వెల్లడించిన సీఐ స్వామినాయుడు

కశింకోట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మోటర్ల వైర్ల చోరీల కేసుల్లో ముగ్గురు నిందితులను గురువారం కశింకోట పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. కశింకోట, ఏఎస్‌పేట గ్రామాలను ఆనుకొని ఉన్న శారదానది ప్రాంతంలో గల పంట పొలాల్లో వ్యవసాయ మోటార్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకుపోయారని ఈ నెల నాలుగున, జూలై 30న ఆయా ప్రాంతాల రైతులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీంతో నిందితులను పట్టుకునేందుకు ఎస్‌ఐలు మనోజ్ కుమార్, లక్ష్మణ్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. ఈ క్రమంలో చోరీచేసిన వైర్లను ఎలమంచిలిలోని స్క్రాప్ దుకాణంలో విక్రయించేందుకు తీసుకు వెళుతుండగా గురువారం కశింకోట రైల్వే గేటు వద్ద పోలీసులు వీరిని గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. ఈ ఘటనలో అనకాపల్లి మండలం సుబ్రహ్మణ్యం కాలనీకి చెందిన నక్క లచ్చి, నక్క డేనియల్, గంట భీమరాజులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. కాగా, నిందితులు పక్షుల వేట పేరుతో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి మోటార్ షెడ్లలో ఉన్న విద్యుత్ వైర్లను కత్తిరించి, వాటి నుంచి కాపర్‌ను వేరు చేసి స్క్రాప్ దుకాణాలకు విక్రయించేవారని విచారణలో తేలినట్టు సీఐ తెలిపారు. ఈ కేసులను ఛేదించేందుకు కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు, మధుబాబు, డి.శ్రీను, కానిస్టేబుల్ డి.గోపి, బి.శ్రీనివాస్, బి.మహేష్, వై.లక్ష్మణ్, ఎం.శ్రీను, ఎం.అప్పలరాజులను ఆయన అభినందించారు.



చోరీల వివరాలు వెల్లడిస్తూ, నిందితులను చూపుతున్న సీఐ స్వామినాయుడు

నెహ్రూచౌక్‌లో ఏఐఎస్ఎఫ్ ఆందోళన

▸ పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశం నిషేధంపై అభ్యంతరం



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా గురువారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు ఇక్కడి నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు ప్రవేశించకుండా నిషేధాన్ని విధించడం తగదన్నారు. విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తాయన్నారు. తక్షణమే ప్రభుత్వం సదరు ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు దివ్య, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'తల్లిపాల విశిష్టత నేటితరానికి తెలియజేయాలి'

సబ్బవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు అమృతమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం ముగిసిన సందర్భంగా సీడీపీవో లలితకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. తల్లిపాల విశిష్టతను నేటితరం యువతులకు తెలియజేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి ఐసీడీఎస్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యకుమారి పౌష్టికాహారం, తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీపీ బోకం సూర్యకుమారి కలిసి పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ చైతన్య, వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఇందలి రమణ, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, శరగడం రాము, కనకరాజు, పద్మ, కొండాజీ, శీరం అప్పలరాజు, శింగంపల్లి శ్రీను, శేఖర్, జెట్టి ప్రసాద్‌లతో పాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ముగింపోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

▸ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం



దిబ్బపాలెంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

తుమ్మపాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు చదువుల సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయ విధానాలైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తదితర ఒంటి కషాయాలు వాడటం ద్వారా తెగుళ్లు, పురుగులను నివారించవచ్చునని వివరించారు. రసాయనిక ఎరువుల వాడకంతో క్యాన్సర్ వంటి వ్యాధులబారిన పడే ప్రమాదముందని చెప్పారు. అనంతరం రైతులకు ఘన జీవామృతాలు, ఒంటి కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి, ఆత్మ ఏటీఎం రామకృష్ణ, వ్యవసాయాధికారులు రంజిత, అప్పలరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యపేటలో ...

కశింకోట : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారిణి స్వప్న అన్నారు. సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, రాయితీలు, అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో పశువైద్యాధికారిణి డాక్టర్ దయానా, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.



సుందరయ్యపేటలో మాట్లాడుతున్న ఏవో స్వప్న

విశ్వకవి ఠాగూర్‌కు ఘనంగా నివాళి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాడేరురూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విశ్వకవి, నోబుల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాకూర్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీకలాశాల్లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ రసూల్ అధ్యాపకులతో కలిసి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఠాగూర్ రచనలు, కవితలు, గీతాలను విద్యార్థులకు వి వరించారు. గీతాంజలి కవితా సంకలనానికి నోబుల్ బహుమతి లభించిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఠాగూర్ పాత్రను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబెట్ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. అంగ్ల శాఖ విభాగాధిపతి పి.కోటేశ్వరరావు, జేకేసీ సమన్వయకర్త జి.భాస్కరరావులు ఠాగూర్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.నిర్మల, జి.గౌరీశంకరరావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన భూమి అప్పగించాలి: మాజీ సైనికుడు

అరకులోయ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశ సైనికుడిగా సేవలందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అందించిన భూమిని తనకు అప్పగించాలని మాజీ సైనికుడు, గిరిజనుడు పాచిపెంట సింహాచలం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులకు అందించిన వివరాలివి.. 1985నుంచి 2009 వరకు దేశ సరిహద్దులో పనిచేసినట్టు చెప్పారు. రిటైర్డ్ అనంతరం సైనికుల కోటాలో అరకులోయ మండలంలో పెదలబుడ పంచాయతీ రవ్వలగుడ గ్రామంలో సర్వే నంబర్ 68/2 లో 4.75 సెంట్ల డీ ఫారం భూమిని ప్రభుత్వం కేటాయించందన్నారు. ఈ భూమిని నేటివరకు తనకు అప్పగించలేదన్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితంలేకపోయిందని వాపోయారు. గురువారం తిరిగి తహశీల్దార్ అప్పారావును కలిసి తనకు న్యాయం చేయాలని కోరినట్టు చెప్పారు. వెంటనే తహశీల్దార్, రెవెన్యూసిబ్బంది, పోలీసులు స్థలాన్ని పరిశీలించారన్నారు. గ్రామస్థులతో మాట్లాడి స్థలం అప్పగించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బ్యాంక్ ఖాతాదారులకు ప్రమాద బీమా పాలసీ తప్పనిసరి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతాదారులు ప్రమాద బీమా పాలసీ చేయించుకోవాలని విశాఖపట్నం యూకో బ్యాంక్ చీఫ్ మేనేజర్ డి. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో యూకో బ్యాంక్ ఖాతాదారులతో కేంద్ర ప్రభుత్వ ప్రమాద బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై ప్రమాద బీమా పాలసీలు చేయించుకోవాలన్నారు. స్థానిక బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ బ్యాంక్ పరిధిలో 4 వేల మందికి ఖాతాదారులకు ఆధార్, ఫోన్ అనుసంధానం చేయించుకోలేదన్నారు. వీరికి ప్రభుత్వ రాయితీలు అందవన్నారు. వెంటనే అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్, వెలుగు ఏపీఎం సూర్యారావు పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కిడ్నాప్‌పై దర్యాప్తు: ఎస్పీ



కిడ్నాప్‌కు గురైన శ్రీసౌమశ్రీ (ఫైల్)

పాడేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవిపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సోమం శ్రీసౌమ్య (26) గురువారం ఉదయం కిడ్నాప్‌నకు గురైన నేపథ్యంలో ఈ కేసు ముమ్మర దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్పీ అమిత్‌బర్దార్ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయన్నారు. అలాగే, వేటుకూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, కొందరి సహకారంతో ఈ ఘటనకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణ తేలిందన్నారు. అలాగే గతేడాది అక్టోబరులో ఇదే తరహాలో మహిళను కిడ్నాప్ చేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తులే ఈ ఘటనకూ పాల్పడి ఉండొచ్చని అనుమానిస్తున్నామన్నారు. నిందితుల్ని త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌ను రక్షిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో బాల నేరస్థుడికి రెండేళ్లు జైలు

రంపచోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికను అత్యాచారం చేసిన కేసులో గిరిజనబాల నేరస్థుడికి రెండేళ్ల శిక్షకు ఖరారు చేస్తూ రాజమహేంద్రవరం జువైనల్ కోర్టు మెజిస్ట్రేట్ చావలి రమ్య గురువారం తీర్పు వెల్లడించారు. మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన బాలికను ఆదే గ్రామానికి చెందిన బాల నేరస్థుడు మాయమాటలు చెప్పి అడవిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో బాల నేరస్థుడికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రాజశేఖర్ వాదనలు వినిపించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ శేషు, కోర్ట్ మోనిటరింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ముక్తేశ్వరరావు సాక్షులను ప్రవేశపెట్టారు.



బాలింతలకు పండ్లు అందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రుక్మిణి

తల్లి పాలు శిశువుకు అత్యుత్తమ ఆహారం

» మెడికల్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ హేమలతా దేవి

పాడేరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు శిశువుకు అత్యుత్తమ ఆహారమని స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ హేమలతా దేవి అన్నారు. తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంట వ్యవధిలో తల్లి పాలు పట్టడం వల్ల అవి ఔషధంలా పనిచేస్తాయన్నారు. శిశువుకు 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. తల్లి పాలు జీర్ణ వ్యవస్థ అభివృద్ధికి సహాయపడుతుందన్నారు. ఆరు నెలల తరువాత రెండేళ్ల వరకు ఇతర ఆహారాలతో పాటు తల్లిబాలను బిడ్డకు అందించాలన్నారు. కార్యక్రమంలో గైనిక్ విభాధిపతి డాక్టర్ నరసింగరావు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు వైద్య ఆరోగ్య సిబ్బంది, కళాశాల, ఆస్పత్రి సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరం

జి.మాడుగుల: పుట్టిన వెంటనే పిల్లలకు తల్లి పాలు పెట్టాలని సీడీపీవో బాల మణి దేవి సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి: తల్లులు శిశువులకు పాలు పట్టడంలోనూ మెలకువలు పాటించాలని ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి రుక్మిణి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, స్త్రీశక్తి భవనంలో ఐసీడీఎస్ ఉద్యోగులను ఘనంగా నిర్వహించారు.ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న టేక్ హోం రేషన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, సౌజన్య, మహిళా కానిస్టేబుల్ అరుణ కుమారి పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.సుగుణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమన్నారు. సర్పంచ్ రూతు, ఎంపీడీవో ప్రభాకర్, వైద్యాధికారిణి జ్ఞానేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు కొండమ్మ, వరహాలమ్మ, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: శిశువులకు తల్లి ముర్రుపాలు తొలి వ్యాధి నిరోధక టీకాగా పనిచే స్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహిని అన్నారు. గురువారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వలసమ్మ, మాలతి పాల్గొన్నారు.



జి. మాడుగులలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మోహిని

పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి: కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

పాడేరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య పరిరక్షణకు నులిపురుగుల నిరోధక మాత్రలను తప్పక వేయించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ మంగళవారం పక్కాగా జాతీయ నిరోధక దినోత్సవం పక్కా నిర్వహించాన్నారు. చిన్నారులకు అల్బెండాజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర వేయాలన్నారు. ఆ రోజు వేయని పిల్లలకు ఆగస్టు 20వ తేదీ బుధవారం నిర్వహించి మాత్రలు వేయించాలని కోరారు. పిల్లలు, కిశోర బాలికల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వస్తుందన్నారు. జిల్లాలో 3,124 ప్రాథమిక పాఠశాలలు, యూపీ, పాఠశాలలు, హైస్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్ వసతి గృహాలు, 3,214 అంగన్వాడీ కేంద్రాల్లో ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో, ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్ నర్సింగ్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్. ఎంజే.అభిషేక్‌గౌడ, డీఎంహెచ్‌వో డాక్టర్.టి.విశ్వేశ్వరరావు నాయుడు, ఏడీ ఎంహెచ్‌వో టీఎన్.ప్రతాప్, డీఈవో పి.బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ డీడీ, ఐసీడీఎస్ పీడీ, డీపీవో, ఆర్‌బీఎస్‌కే మేనేజర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం



సమావేశం మందిరలోకి వచ్చి నిరసన వ్యక్తంచేస్తున్న గిరిజనులు

అనంతగిరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుజ్జెలి, చిట్టంపాడు, రేగుళ్ల పాలెం హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షత గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్ర స్తావించారు. రైతులకు సకాలంలో యూరియా, డీఏపీ అందించాలని, ఆ శ్రమ పాఠశాలలోని నాణ్యమైనవిద్యతో పాటుగా భోజనం అమలు చేయాలని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు కోరారు. పెద్దూరు నుంచి పెదబయల్ రింగురోడ్డు పనులు పూర్తికి చర్యలు చేపట్టాలని గిరిజనులు వినతిపత్రం అందజేశారు. అనంతరం గుజ్జెలి, చిట్టంపాడు, రేగుళ్లపాలెం హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దంటూ ఆయా గ్రామాల గిరిజనులు, సీపీఎం ఆధ్వర్యంల సర్వసభ్య సమావేశ మందిరంలోకి లోపలకి వచ్చి నినాదాలు చేశారు. సభ్యుల స మక్షంలోని హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో ప్రభాకర్, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

ముంచంగిపుట్టు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టు, లూబ్బురు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోగల పలు పాఠశాలకు ఉపాధ్యాయులకు యూటీఎఫ్ సభ్యత్యాలను నమోదు చేసుకోవాలని, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు గురువారం కోరారు. ఉపాధ్యాయులు సమస్యలపై పోరాటం చేసేందుకు, యూటీఎఫ్ ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలోని మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు, కార్యదర్శి గోపి, ఆడిట్ సభ్యులు దాసన్న, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రభావాలపై అవగాహన

పాడేరురూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అణు బాంబులదాడిలో ధ్వంసమైన హిరోషిమా, నాగసాకి నగరాల సంస్మరణ దినం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎన్ రసూల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రభావాలపై యువత, విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రపంచ శాంతి, అణు నిరాయుధీకరణ ప్రాముఖ్యతను వివరించారు. సైన్స్ ఆఫ్ బెటర్ సొసైటీ ఎన్‌జీవో స్థాపకుడు జగదీశ్, డాక్టర్. గణేశ్, సైన్స్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సౌజన్య, అధ్యాపకులు జి.దామోదరరావు, డాక్టర్.పి.జానకిరావు, పి.చంద్రశేఖర్, సైన్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం సదుపాయం



గర్భిణులకు భోజనాలందిస్తున్న మాతృభూమి సేవా సంస్థ సభ్యులు

అనంతగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో 150 మంది గర్భిణులకు మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు, వైద్యుడు బి.నగేశ్ మాట్లాడుతూ.. ప్రతినెలా ఆస్పత్రికి తనిఖీలకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గర్భిణులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు వివరించారు. ఇందుకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వామి, గోపి, కిరణ్, రమేశ్, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ భాషలు, పర్యావరణంపై సైకిల్ యాత్ర



సీలేరుకు చేరుకున్న నవీన్, రాజ్‌కుమార్

సీలేరు, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): ప్రాంతీయ భాషలు, పర్యావరణంపై అధ్యయనంపై జాతీయ స్థాయిలో సైకిల్ యాత్ర చేస్తున్న ఇద్దరు యువకులు జీకేవీధి మండలం సీలేరు కు గురువారం చేరుకున్నారు. తిరుపతి జిల్లా నాగలాపురం మండలం ఎస్ పురానికి చెందిన నవీన్, తెలంగాణాలోని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన రాజ్‌కుమార్ కలిసిఈ సైకిల్ యాత్ర చేపడుతున్నారు. తాము తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసినట్టు, ఏడాదిపాటు రోజుకు 100 కిలోమీటర్ల చొప్పున సైకిల్‌పై దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రదేశాలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. తిరుపతినాగలాపూర్ నుంచి గత ఏప్రిల్ 23వ తేదీన ఈ యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ హరియాణా, పంజాబ్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఈ యాత్ర సాగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణాలో ముగించుకుని ఆంధ్రాలోకి అడుగుపెట్టామన్నారు. అరకు వెళ్లి అ క్కడ ముగిస్తామనిఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో మాట్లాడే భాష, పర్యావరణంపై వీడియోలను చిత్రీకరించి యూ ట్యూబ్ ద్వారా ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు.

'ఉద్యోగ నియామక చట్టంపై ప్రకటన చేయాలి'



బస్సు యాత్రను ప్రారంభించిన ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. ఆగస్టు 8న అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జరిగే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని గురువారం బస్సు యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో ఉ ద్యోగాల్లో స్థానిక గిరిజనులకు రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టపులి శ్రీనివాస్ పడాల్, జేఏసీ నాయకులు జర్సింగి క్రిష్ణ, పూజారి సురేశ్‌కుమార్, పల్లుల రామారావు, అంజి, కిశోర్, బాబీ, సోమేశ్ పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కొయ్యూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గిరిజన సంక్షేమ గురకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న 33 సీట్లు భర్తీకు అర్హులైన విద్యార్థులు పాఠశాల పనిదినాలలో తమను సంప్రదించాలని ప్రిన్సిపాల్ నరసింహారావు కోరారు. 5వ తరగతిలో 27 సీట్లు, 9వ తరగతిలో 7 సీట్లు ఖాళీలున్నాయని, వీటిని భర్తీ చేయనున్నట్టుగా వివరించారు.

రక్తహీనత బాలింతకు ఆస్పత్రికి తరలింపు

» ప్రజాప్రతినిధుల చొరవతో చికిత్స



రక్తహీనతతో బాధపడుతున్న కమలమ్మను పరీక్షిస్తున్న వైద్యాధికారి లావణ్య

చింతపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం చిన్నఅగ్రహారం గ్రామంలో తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న బాలింత వంతల కమలమ్మకు గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పీహెచ్‌సీ వైద్యులు చొరవతో ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెకు వైద్యులు పరీక్షించి 5.5గ్రాముల హిమోగ్లోబిన్(హెచ్‌బీ) ఉన్నట్టు గుర్తించారు. దీంతో వెంటనే ఆమెకు రక్తం అందించేందుకు వైద్యులు ఏర్పాటు చేశారు. కమలమ్మ ఐదురోజుల కిందట గృహంలో ప్రసవం పొందారు. వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు ఆమెను ప్రసవం కోసం ముందుగా ఆస్పత్రికి తరలించలేదు. దీంతో ఆమెకు స్థానిక మహిళలు గృహంలోనే ప్రసవం ప్రసవం చేశారు. ఆమె ఆడ శిశువుకి జన్మనిచ్చింది. శిశువు బొడ్డు కోయడం లోశాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడం వల్ల శిశువుకి ఇన్‌ఫెక్షన్ సోకింది. వెంటనే తల్లిదండ్రులు జీకేవీధి పీహెచ్‌సీకి తీసుకువచ్చినా శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఈ క్రమంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో శిశువు మృతి చెందింది. ప్రస్తుతం తల్లి కమలమ్మ తీవ్ర నిరసంగా ఉండడంతో ఆమెను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నట్టు ఆమెకు వైద్యులు పరీక్షించారు. అయితే, బ్లడ్ గ్రూప్ బీ పాజిటివ్ కావడంతో వెనువెంటనే ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి ప్రత్యేక చొరవ తీసుకుని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి నుంచి యూనిట్ రక్తం తెప్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లావణ్య మాట్లాడుతూ కమలమ్మకు మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఆమెకు రెండు యూనిట్ల వరకు రక్తం అందించాల్సి ఉందన్నారు. మహిళలు మంచి పోషకాహారం తీసుకోవడంతోపాటు వైద్యుల సలహామేరకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మందులు క్రమంగా వేసుకుంటే ఇలాంటి సమస్యలు ఎదురుకావని సూచించారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఎంపీపీలు బోయిన కుమారి, కోరాబు అనుషదేవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కవడం ఈశ్వరరావు, ఎల్‌టీ అనిల్ పాల్గొన్నారు.

'గుత్తులపుట్టును మండల కేంద్రంగా మార్చాలి'



గుత్తులపుట్టు సంతలో ఆందోళన చేపట్టిన సాధన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గుత్తులపుట్టు పంచాయతీని మండల కేంద్రంగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రామంలో జరిగిన వారపు సంతలో మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ కన్వీనర్ వంతాల సూరిబాబు, సభ్యులు అంగనైని ఆనంద్, కోరాబు బాలంపడాల్ మాట్లాడుతూ, గుత్తులపుట్టు పంచాయతీ కేంద్రానికి అనుకుని ఉన్న పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాలకు చెందిన పంచాయతీలను కలుపుకుని గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల 16 పంచాయతీల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు వి. రామన్న, వి.చిన్నారావు, కె.విశ్వనాథం, కె.సత్యనారాయణ, వి.రాంబాబు, నీలకంఠం, సన్నిబాబు, బాబూరావు పడాల్, సన్యాసిరావు, కె.సింహాచలం, కె.బంగారుపడాల్, బి.సింహాచలం, బి.ప్రసాద్, రామన్నదొర పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



రత్నంపేటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేత దొరబాబు తదితరులు

కొయ్యూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నదని టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు పేర్కొన్నారు. మండలంలో రత్నంపేట గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, ఎన్నికల హామీలు అమలు చేసిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌ కర్యం కల్పించనున్నట్టు చెప్పారు. మాజీ సర్పంచ్ శంకరరావు, బూత్ ఇన్‌చార్జి శ్రీసత్య వెంకటేష్, నూకాలమ్మ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపు ఖాతాలతో లాభాలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):ముంచంగిపుట్టు, పెదబయల్ మండలాల్లోగల బంగారుమెట్ట, కిలగాడ, పోయిపల్లి, లక్ష్మీపేట పంచాయతీ పలు గ్రామాల్లో పోస్టల్ పొదుపుఖాతాలపై స్పెషల్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు డివిజన్ పోస్టల్ ఐపీవో వి.లక్ష్మీకిశోర్ మాట్లాడుతూ..నేటి పొదుపే రేపటి మదుపని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, పోస్టల్ పొదుపు ఖాతాల ద్వారా సామాన్యునికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలోని ఎంవో శ్రీను, బీపీఎం, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఎంపిక వేగవంతం

చింతపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల ఎంపికను వేగవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. గురువారం లంబసింగి గ్రామ పంచాయతీలో పీ4లో భాగంగా గ్రామ సచివాలయం ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడివున్న కుటుంబాలను సర్వే చేసి ఎంపిక చేస్తున్నామన్నారు. అలాగే రాత్రి ఆబా జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్(డీఏ జుగా) కార్యక్రమంలో భాగంగా పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు సర్వే చేపడుతున్నామన్నారు.అనంతరం పంచాయతీ కేంద్రంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కోర్ర శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, కూటమి నాయకులు లక్ష్మియ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ



పాడేరులో కిటకిటలాడుతున్న పూలు, పండ్ల దుకాణాలు

పాడేరురూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాడేరు మార్కెట్‌లో గురువారం శ్రావణ శుక్రవారం సందడి కనిపించింది. వరలక్ష్మి వ్రతాలకు అవసరమయ్యే పూలు, పండ్లు, పూజ సామగ్రి కొనుగోలుకు మహిళలు గురువారం సాయంత్రం 4 గంటల నుంచి మార్కెట్‌కు రావడంతో దుకాణాలు కళకళలాడాయి. పూల, పండ్ల ధరలు అధికంగా ఉన్నా, మహిళలు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో రూ. 20 నుంచి రూ. 25కు అమ్మకాలు చేపట్టే కొబ్బరికాయను వ్యాపారులు గురువారం రూ. 30 నుంచి రూ. 35, రూ. 40కు విక్రయించారు. రూ. 50కి ఉన్న డజన్ అరటి పండ్లు రూ. 60 నుంచి రూ. 70కి అమ్మకాలు చేపట్టారు. పూల ధరలు ఆకాశాన్ని అంటాయి. అయినా, వ్యాపారాలు జోరుగా సాగాయి.

రంపచోడవరం ఆస్పత్రిలో నిర్లక్ష్యం: గర్భిణి మృతి



పండా సింధూర మృత దేహం, మృత శిశువు పక్కన ముగ్గురు ఆడబిడ్డలు

రంపచోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆ సుపత్రి నిర్లక్ష్యానికి నిండు గర్భిణీ మృతి చెందింది. వివరాలివి.. దేవీపట్నం మండలం దామనపల్లికి చెందిన ముగ్గురు ఆడబిడ్డల తల్లి పండా సింధూరం (29) నాల్గవ కాన్పు కోసం జూలై 18న రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేరారు. 20 రోజుల పర్యవేక్షణ అనంతరం బుధవారం ఆమెకు సహజ ప్రసవం చేయాలని ప్రయత్నించి విఫలమైన ఆసుపత్రి వైద్యులు పరిస్థితి చేయి దాటిపోయిన తర్వాత హుటాహుటిని రాత్రి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, అక్కడ తక్షణం సిజేరియన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. అప్పటికే ఆమె మరణించింది. అయితే, గర్భంలో ఉన్న బిడ్డను రక్షించేందుకు వైద్యులు శస్త్ర చికిత్స చేసిచూస్తే ఆమె కడుపులో ఉన్న మగబిడ్డ కూడా మరణించింది. పండా సింధూరం తన భర్తతో రాజమహేంద్రవరంలో జీవిస్తోంది. ఆమె ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలకు సహజ ప్రసవంలో జన్మనిచ్చింది. నాల్గవ కాన్పులోనైనా తమకు మగబి డ్డ పుడుతాడని ఆ దంపతులు ఆశించారు. చివరికి తల్లి, బిడ్డకు ప్రాణాలకు ముప్పు వాటిల్లింది. ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది. చిన్నారులు తల్లి లేని అనాథలయ్యారు. ఆసుపత్రిలో ఇటీవల కాలంలో ఇటువంటి నిర్లక్ష్య ఘటనలు పలు చోటు చేసుకున్నాయి. కాగా ఈ తాజా ఘటనపై మాత్రం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం స్పందించి విచారణకు ఆదేశించారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సామూహిక సీమంతాల్లో ఐసీడీఎస్ పీవో తదితరులు

గొలుగొండ/కృష్ణాదేవిపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : బిడ్డకు తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా అధికారులు, సిబ్బంది గురువారం గొలుగొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగౌరి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోనే తల్లిపాలు ఇవ్వాలన్నారు. మొదటి ఆరునెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తే పోషకాలు పెరగడంతో పాటు ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజ్, ఎంఈవో సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రాఘవ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛనర్ల సంఘ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జాలమ్మ

నర్సీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పింఛనర్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంఘం నర్సీపట్నం తాలూకా సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా వి.గజ్జాలమ్మ, కార్యదర్శిగా డీవీఎస్ఎన్‌రాజు, గౌరవాధ్యక్షులుగా కె.రామస్వామి, అసోసియేటెడ్ అధ్యక్షులుగా డాక్టర్ వి.రామచంద్రరాజు ఎంపికయ్యారు. అధ్యక్షులు గజ్జాలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పింఛనర్లకు హెల్త్ కార్డుపై నగదురహిత వైద్య సేవలన్నీ కార్పొరేట్ ఆస్పత్రులలో అందించాలని కోరారు. అనంతరం దందులూరి సుబ్బరాజు, కంచర్ల సత్యారావు, దేవరకొండ వెంకట సత్యప్రభు, రాయపురెడ్డి నాగరాజు, ఆచంట సూర్యనారాయణమూర్తిలను సత్కరించారు. స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్.సోమేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు జగన్నాథరావు, కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు డిగ్రీ విద్యార్థి



విజయకుమార్ జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్

నర్సీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో నర్సీపట్నం ప్రభుత్వ కళాశాల విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇక్కడి ప్రభుత్వ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న పి.విజయకుమార్ బుధవారం విశాఖపట్నంలోని కృష్ణా కళాశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి వక్తృత్వ పోటీలకు హాజరై ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో ఈ నెల 11 తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు.

పట్నంలో పండుగ శోభ

▸▸ వరలక్ష్మీ పూజా సామగ్రి కొనుగోలుకు భారీగా తరలి వచ్చిన జనం ▸▸ బంగారం, పూలు, పండ్లు, వస్త్ర దుకాణాలు కిటకిట



పూల దుకాణం వద్ద రద్దీ



అబీద్ సెంటర్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు జనంతో కిటకిటలాడుతున్న మార్కెట్

నర్సీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పట్నంలో పండుగ శోభ నెలకొంది. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో స్థానికులతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో గురువారం అబీద్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మెయిన్‌రోడ్డు కిటకిటలాడింది. ఏ దుకాణంలో చూసినా జనసందడే కనిపించింది. పువ్వులు, పండ్లు, వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాలలో కొనుగోలుదారుల రద్దీ కనిపించింది. అరటి పండ్లు డజను రూ.70, కొబ్బరికాయ రూ.30లకు విక్రయించారు. చామంతి, గులాబీ, కలువపువ్వుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ ఎవరూ వెనక్కి తగ్గలేదు. వ్రతానికి ముఖ్యమైన కాసు కొనుగోలుకు పలువురు ఉత్సాహం చూపడంతో బంగారు షాపులు కూడా సందడిగానే కనిపించాయి.

ప్రకృతి వ్యవసాయం మేలు

నర్సీపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి సారవంతమై అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్ర అన్నారు. అప్పన్నపాలెంలో వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఎస్.విజయలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీరామ్మూర్తి

మాకవరపాలెం,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడిగా నిద్ర శ్రీరామ్మూర్తి ఎన్నికయ్యారు. గురువారం ఇక్కడ నిర్వహించిన ఎన్నికల్లో కార్యదర్శిగా మల్లేష్‌లింగం, ఉపాధ్యక్షుడిగా వరహాలబాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

నర్సీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి దమయంతి ఆయన చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఎటు చూసినా జలమయం

▸▸ మూడు మండలాల్లో కుండపోత వాన ▸▸ తాడపాల ప్రాథమిక పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థులకు అవస్థలు



భారీ వర్షానికి జలమయమైన నాతవరం మెయిన్ రోడ్డు

నాతవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎటు చూసినా నీరే కనిపించింది. వానా కాలం అయినప్పటికీ గత పది రోజులుగా పలుచోట్ల వరుణుడి కరుణ కరువైంది. దీనికితోడు వేసవిని తలపించేలా ఎండలు మండుతుండడంతో జనం ఉష్ణతాపానికి గురయ్యారు. మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి మూడు గంటల వరకు రోడ్లపై జన సంచారం పెద్దగా ఉండేది కాదు. ఇక రైతులైతే వరినారు పోసి వర్షం కోసం ఎదురు చూపులు చూసేవారు. కొందరు గత్యంతరం లేక బిందెలు, కావిడ్లతో నీటిని తోడుకొని వచ్చి నారుమడికి తడులు అందించేవారు. ఇటువంటి తరుణంలో గురువారం ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. నాతవరంలో ఈదురు గాలులతో కుండపోతగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎండలకు ఎండిపోతున్న వరినారుకు ఈ వర్షం ఊపిరి పోసినట్లైంది. నాతవరం మెయిన్ రోడ్డుపైన, మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలు అంతరాయం ఏర్పడింది.

మాకవరపాలెం మండలంలో...

మాకవరపాలెం : మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. తాడపాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలోకి వర్షపునీరు చేరింది. దీంతో విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు తడిసిపోయాయి. ఎప్పుడు వర్షం వచ్చినా తాము ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని వారంతా వాపోయారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నట్టు చెప్తున్నారు. అంతేకాకుండా రోడ్డుకి పల్లంగా పాఠశాల ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా తరగతి గదుల్లోకి నీరు చేరుతున్నట్టు తెలిపారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతోందని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

గొలుగొండ మండలంలో...

గొలుగొండ/కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని జోగంపేట, చీడిగుమ్మల, మల్లంపేట, పాకలపాడు, ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షంపడింది. దీంతో ఎటుచూసినా జలమే దర్శనమిచ్చింది. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గొల్లవీధి, వినాయక కాలనీ, బీసీకాలనీ తదితర ప్రాంతాలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీసీ రోడ్లపై వర్షపు నీటితో పాటు మురుగు చేరడంతో మరిన్ని ఇబ్బందులు తప్పలేదు. వర్షం కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చెరువులు, బొడ్డేరు గెడ్డలో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మాకవరపాలెం మండలం తాడపాల పాఠశాలలోకి చేరిన వర్షపు నీరు

గణపతి ఉత్సవాలకు ముహూర్తపు రాట



ఉత్సవ రాట కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వరాలయ వినాయకచవితి ఉత్సవాలకు ఉత్సవ ముహూర్తపు రాటను గురువారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, ఈ ఏడాది గణేశుని ఉత్సవాలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4 వరకూ వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 63 అడుగుల భారీ వినాయకుని విగ్రహం ఈసారి ఏర్పాటు చేసి పూజలందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబమూర్తి, ఈవో సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి, స్థానిక నాయకులు ఎర్రంశెట్టి చిన్న, దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీనివాసరావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు

చోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం 20 వసంతాల వేడుక సందర్భంగా ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన అంతర్ డిగ్రీ కళాశాలల వివిధ పోటీలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాలేజీకి చెందిన వై. ధనలక్ష్మి వ్యాసరచన పో టీల్లో ప్రథమ స్థానం, ఎస్. గాయత్రి ద్వితీయ స్థానం సాధించారు. క్విజ్ పోటీల్లో వై.ధనలక్ష్మి, గాయత్రి, కృపాచందు టీమ్ ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి. సత్యవతి, సమన్వయకర్త నారాయణమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, బిచ్చమ్మ, లెక్చరర్లు సుధీర్, అప్పలనాయుడు తదితరులు అభినందించారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నేతలు



మంత్రి మనోహర్‌తో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి పీవీ ఎస్ఎన్ రాజు

చోడవరం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు కలిశారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి నియోజకవర్గంలో పార్టీ పరమైన కార్యక్రమాలు, ప్రజా సమస్యలను వివరించినట్టు రాజు తెలిపారు.

రాజన్నపేట క్వారీ పేలుళ్లపై నిరసన

రోలుగుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజన్నపేట క్వారీ యాజమాన్యం అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. క్వారీలో భారీ పేలుళ్లతో గ్రామంలో ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. క్వారీ కాలుష్యంతో పరిసరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం తహశీల్దార్ నాగమ్మకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు బోనంగి రామలక్ష్మి, కిడారి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండ దిగువన కల్యాణలోవకు వస్తే వసతుల కల్పన

▸▸ గిరిశిఖర జీలుగులోవ పీవీటీజీలతో ఎంపీడీవో



కొండ శిఖర ఆదివాసీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామస్వామి

రావికమతం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీలు కొండ శిఖరంపై కాకుండా, కొండ దిగువనున్న కల్యాణపులోవకు వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎంపీడీవో సీతారామస్వామి హితవు పలికారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీ4 సర్వేలో భాగంగా గురువారం ఆయన చీమలపాడు పంచాయతీ శివారు కొండశిఖర గ్రామమైన జీలుగులోవ కాలినడకన వెళ్లి సందర్శించారు. గ్రామంలోని ఉన్న ఆరు కుటుంబాల పీవీటీజీలతో ఆయన సమావేశమయ్యారు. తమ రోడ్డు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులులేవని గ్రామస్థులు తెలిపారు. ఎవరైనా అనారోగ్యానికి లోనైతే వైద్య సదుపాయం అందక మృత్యువాతపడుతున్నారని తెలిపారు. తమ పిల్లలు చదువుకు, నిత్యావసర సరకులకు నోచుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, కొండపైకి రహదారి నిర్మాణం సాధ్యంకాదని, కొండ దిగువ కల్యాణపులోవకు దిగి వస్తే వసతులతోపాటు ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మిస్తుందన్నారు. కొండపై భూముల్లోనే వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగించవచ్చునని సూచించారు. వీటిపై అంగీకరిస్తే.. కొండ దిగువన కల్యాణపులోవలో సౌకర్యాల కల్పనపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని ఎంపీడీవో వివరించారు. అనంతరం ఆయన తాడిపత్రి, పెద్ద గరువు గ్రామాలను సందర్శించారు. ఇక్కడి గిరిజనులు తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం నిర్మాణ పనులు ఎంపీడీవో ఈసందర్భంగా ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బద్రి చిన్నాబ్బాయి. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శుక్రవారం శోభ

రావికమతం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండల కేంద్రంలో గురువారం పూలు, పండ్లు, కిరాణా దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులుతీరారు. ఇదేఅదను వ్యాపారులు అధికధరకు విక్రయించారు. కొబ్బరి కాయ రూ.30, అరటిపండ్లు పెడ సాధారణ రోజుల్లో రూ.40లు కాగా, గురువారం రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయించారు. యాపిల్, బొత్తాయి, దానిమ్మ, జామ తదితర పండ్లు అధిక ధరలకు విక్రయించారు.బంతి, చామంతి, తామర, కలువలు తదితర పూలకు గిరాకీ నెలకొంది.కలువ రూ.20 వరకు విక్రయించారు.

మాడుగులలో..

మాడుగుల: శ్రావణమాస భక్తులతో గురువారం మండల కేంద్రం కిటకిటలాడింది. పండ్లు, వస్త్ర, బంగారు దుకాణాల వద్ద భక్తులు బారులుతీరారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

కెకోటపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చౌడువాడలో బదిలీ, ఇక్కడికి కొత్తగా వచ్చిన సచివాలయ సిబ్బందితో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు ఏటుకూరి అప్పలరాజు (రాజేశ్), పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పి. సురేశ్‌బాబు పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రాల తనిఖీ



దేవరాపల్లిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీ దినేశ్

దేవరాపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి, వేచలం, కొత్తపెంట, దేవరాపల్లి గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలను కె. కోటపాడు సహాయ సంచాలకులు ఇ.దినేశ్ తనిఖీ చేశారు. రికార్డులు, మందులు, సమగ్ర ఆర్థిక అభివృద్ధిపై నిర్వహిస్తున్న సర్వేలను పరిశీలించారు. పశువైద్యాధికారులు గాయత్రీదేవీ, మంజుషారాణి, జి.ప్రియాంక, సిబ్బంది సురేష తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు: ఎమ్మెల్యే



గౌరీపట్నంలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం రైతులకు అందుబాటు ధరల్లోనే ఎరువులు సరఫరా చేస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం మండలంలోని గౌరీపట్నం సచివాలయం వద్ద రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్,విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్, టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

మహిళలు డెయిరీలు ఏర్పాటు చేస్తే ప్రోత్సాహం

చీడికాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో మహిళలు సంఘంగా మారి డెయిరీ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రూ.2లక్షలు విలువైన పరికరాలు ఉచితంగా అందజేస్తుందని మహిళ డెయిరీ సహకార సంఘాల నోడల్ ఆఫీసర్ డా.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో అర్జునగిరి పాలకేంద్రంలో పాడిరైతులతో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీ డా.వి.చిట్టినాయుడు, పశువైద్యాధికారులు డా.ప్రశాంత్, మణిలక్ష్మణ్, ఏపీడీటీఎస్ఎఫ్ మేనేజర్ రాజేష్, సర్పంచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



రావికమతంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

రావికమతం: తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో గురువారం అంగన్‌వాడీలు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీడీపీవో వి.మంగతాయారు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మంగతాయారు మాట్లాడుతూ, తల్లిపాల విశిష్టతను గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హేమ, ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: నవజాత శిశువుకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తల్లి పాలపై అపోహలు వీడాలని కోరారు. ఐసీడీఎస్ పీవో లలితకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బంగారు లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కిల్లో సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి: జిల్లా అధికారి మంగవేణి



కోనాంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంగవేణి

చీడికాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమశాఖ, సాధికారిత జిల్లా అధికారిణి జి.మంగవేణి కోరారు. కోనాం జలాశయం వద్ద జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. శనివారం ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్ఎం యు.వి. రమణమూర్తి, రిటైర్డ్ హెచ్ఎం చలుగు జగన్నాధంనాయుడు, కార్యదర్శులు ఎస్.సింహాచలం నాయుడు, ఎ.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన



గరుగుబిల్లిలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం చౌడువాడ శివారు గరుగుబిల్లి గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేశారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటి కుళాయిల తోపాటు 40వేల లీటర్ల కెపాసిటీతో వాటర్ ట్యాంక్ నిర్మించనున్నారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, నాయకులు కుంచా అంజిబాబు, రాజీ నారాయణమూర్తి, మల్లు గోవింద, ఎన్. మల్లునాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాబులునాయుడు



రోలుగుంట, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పీఏసీ ఎస్ సొసైటీ చైర్‌పర్సన్‌గా నిండుగొండ గ్రామానికి మాజీ సర్పంచ్ సుర్ల బాబులునాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాబులునాయుడు టీడీపీ పార్టీ విజయం కోసం విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్.ఎన్.రాజు చైర్మన్‌గా అవకాశం కల్పించారు. శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

అనకాపల్లికి శ్రావణ శోభ

- బంగారం, వస్త్ర దుకాణాలు కిటకిట
- కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీ


పూజా సామగ్రి దుకాణం వద్ద మహిళలు


పండ్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లికి గురువారం శ్రావణ శోభ సంతరించుకుంది. శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా పూజకు అవసరమయ్యే సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు రద్దీగా మారాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చే వారితో మెయిన్‌రోడ్డులో సందడి నెలకొంది. బంగారం, వస్త్ర, పండ్లు, పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు వంటి సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు రద్దీగా మారాయి. బంగారం ధర ఆకాశాన్నంటుతున్నా వరలక్ష్మీదేవి వ్రతానికి ప్రతి ఒక్కరూ వరలక్ష్మీదేవి కాసు కొనుగోలులో ఆసక్తి చూపుతున్నారు. తులం బంగారం సుమారు రూ.లక్షా 18 వేలు వరకు ధర పలికింది. అయినా బంగారం దుకాణాలన్నీ కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. పండ్ల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణాలు రద్దీగా కనిపించాయి. కొబ్బరికాయల ధరలు ఆకాశాన్నంటాయి. రైతువారి కొబ్బరికాయ ధర ఒక్కొక్కటి రూ.30లు వరకు పలకగా, చిల్లర వర్తకులు కొబ్బరికాయ ఒక్కొక్కటి సైజును బట్టి రూ.35 నుంచి రూ.40ల వరకు విక్రయించారు. పూల ధరలు కూడా బాగా పెరిగాయి. అయినా విక్రయాలు తగ్గలేదు. మార్కెట్లు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి.


కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న పెరుగుబజార్ రోడ్డు


అనకాపల్లిలో రద్దీగా ఉన్న వస్త్ర దుకాణం

'పాడేరు ఘాట్ రోడ్డులో భారీ వాహనాలు నిషేధం'

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ పర్యటన సందర్భంగా శనివారం వరకు పాడేరు ఘాట్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధించినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ తెలిపారు. గురువారం ఇక్కడ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రతా కారణాల దృష్ట్యా ముమ్మరంగా వాహనాల తనిఖీలు, సీఎం వచ్చే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేక బలగాలను రప్పించి కాన్వాయ్, ఇతర వాహన శ్రేణిలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామన్నారు.

నిరంతరం కష్టపడితే విజయం సొంతం

- అవంతి విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మాకవరపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో నిరంతం కష్టపడితే విజయం సొంతం అవుతుందని అవంతి విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని తామరం పంచాతీయ పరిధిలో వున్న అవంతి ఇంజనీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు కొత్త విషయాల గురించి తెలుసుకుంటూ వుండాలని, విషయ పరిజ్ఞానంతోనే ఇంజనీరింగ్ విద్యలో సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. ఇంజనీరింగ్‌లో మంచినైపుణ్యం పొందాలంటే ప్రయోగశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు మన అభివృద్ధిని ఆకాంక్షించే తల్లిదండ్రులను గౌరవించాలని, చేసే పనిపై ఏకాగ్రత ఉండాలన్నారు. మేధస్సును మెరుగు పరచుకోవడానికి ఆధ్యాత్మిక జ్ఞానం దోహదపడుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరాలంటే విజ్ఞాన నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాసం అవసరమని, ఇందుకు అనుగుణంగా తమ కళాశాలలో కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఐటీ ప్రొఫెసర్ (విశాఖ) పల్లంశెట్టి అమల్‌రాజ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతాఫలాల ధరలు అంతంతే!

చీడికాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం సంతకు గురువారం సీతాఫలాలు తీసుకువచ్చిన గిరిజనులు ఊహించని పరిణామాన్ని ఎదుర్కొన్నారు. ఎనిమిదో తేదీన శ్రావణమాసం మూడో శుక్రవారం (వరలక్ష్మీ వ్రతం) కావడంతో సీతాఫలాలకు గిరాకీ పెరిగి, అధిక ధర లభిస్తుందని భావించారు. గత రెండు వారాలతోపోలిస్తే ఈసారి ఎక్కువ మంది కావిళ్లు, బుట్టలతో సీతాఫలాలు తెచ్చారు. కానీ కొనుగోలుదారులు (మారు వ్యాపారులు) అంతగా రాలేదు. దీంతో ఊహించిన ధరలు పలకలేదు. సాధారణంగా శ్రావణ మాసంలో కావిడి (సుమారు 130 పండ్లు) సీతాఫలాలు రూ.1,200 నుంచి రూ.1,500 ధర పలికేవి. కానీ ఈసారి రూ.650 నుంచి రూ.850 మాత్రమే పలికాయి. దీంతో ఆయా గిరిజనులు తీవ్ర నిరాశచెందారు.

ఉచిత ప్రయాణానికి బస్సుల కొరత



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

ఇంటికి చేరుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఇక కాకినాడ, అమలాపురం, భీమవరం, ఏలూరు, విజయవాడ, ఆపై ప్రాంతాలకు అనకాపల్లి మీదుగా (పూడిమడక హైవే జంక్షన్) రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు లేవు. ఈ ప్రాంతాలకు మహిళలు ప్రయాణించాలంటే హైవే జంక్షన్‌కు వెళ్లి ఇతర ఉన్నతశ్రేణి బస్సుల్లో పూర్తి చార్జీ చెల్లించాల్సిందే. ఇతర డిపోల నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కొన్ని అయినా అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు పూర్తిస్థాయిలో వినియోగించుకునే వీలుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





18న హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభం

- అదే రోజు కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్కే బీచ్‌రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్ సమీపాన వీఎంఆర్‌డీఏ ఏర్పాటు చేసిన యుహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాన్ని ఈ నెల 18వ తేదీన ప్రారంభించనున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చేతులు మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కైలాసగిరిపై రూ.1.5 కోట్లతో చేపట్టనున్న త్రిశూల్ ప్రాజెక్టుకు కూడా అదేరోజు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామన్నారు. దీనిని ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇది రాత్రిపూట వెలుగుతుందని, నగరంలో ఎక్కడి నుంచైనా కనిపిస్తుందన్నారు.

దసరా నాటికి రైల్వే జోన్ ఆపరేషన్

- రైల్వే మంత్రిని కోరిన ఎంపీ శ్రీభరత్
- విశాఖకు మూడు రైళ్లు కేటాయించాలని వినతి

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఈ ఏడాది విజయదశమి (అక్టోబరు 2) నుంచి ఆపరేషన్‌లోకి తీసుకు రావాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎంపీ శ్రీభరత్ కోరారు. ఢిల్లీలో గురువారం మంత్రిని కలిసి త్వరగా గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించాలన్నారు. విశాఖ నుంచి మూడు కీలక రైళ్లు అవసరమని వివరించారు. తిరుపతికి రోజువారీ ఎక్స్‌ప్రెస్ రైలు, బెంగళూరుకు సాయంత్రం బయలుదేరేలా వందేభారత్ స్లీపర్ రైలు, విజయవాడ, గుంటూరు మీదుగా హైదరాబాద్‌కు రాత్రిపూట ఎక్స్‌ప్రెస్ రైలు వేయాలని కోరారు. వీటి వల్ల అనేక జిల్లాలకు కనెక్టివిటీ లభిస్తుందన్నారు.


రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ ఇస్తున్న ఎంపీ శ్రీభరత్

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

పాడేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 9న పాడేరు వస్తున్న సందర్భంగా అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ముమ్మరంగా చేపడుతున్నది. ప్రధానంగా వంజంగి గ్రామ సమీపంలోని కాఫీ తోటల సందర్శన, రైతులతో ముఖాముఖి, తరువాత అక్కడికి సమీపంలో గిరిజన పండుగలు, సంప్రదాయ ప్రదర్శనలు, గిరిజనులతో బహిరంగ సభకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దార్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, ఇతర అధికారులు, టీడీపీ నేతలు గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్.. కాఫీ సాగు, ఆదివాసీల పండుగలపై సీఎంకు వివరించే గిరిజనులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అలాగే లగిశపల్లి గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ ప్రదేశాన్ని, గిరిజనులతో, తరువాత కార్యకర్తలతో సమావేశమయ్యే రెండు సభా వేదికలు, వంజంగి గ్రామ చావడి, తదితర ప్రదేశాలను కలెక్టర్ సందర్శించారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

అవినీతి అనకొండ

... 5వ పేజీ తరువాయి

ఉపయోగించి పార్వతీపురంలో ఎస్‌ఈగా పనిచేసిన వ్యక్తిని సస్పెండ్ చేయించడంతోపాటు అక్కడ కార్యాలయాన్ని ఎత్తివేయించారు. ప్రస్తుతం విశాఖలోని ఎస్‌ఈ కార్యాలయం పరిధిలోకి ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాలు ఉండేలా మేనేజ్ చేసుకున్నారు. తనను ఎదిరించి గట్టిగా ప్రశ్నించిన ఒక ఈఈని ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమకు బదిలీ చేశారు. ఇటీవల ఒక ఏఈని సస్పెండ్ చేశారు. ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న శ్రీనివాస్ అధికారంలో ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో పడి ఏసీబీకి చిక్కారు. ఈ నెలలో పదవీ విరమణ చేసేలోగా ఐదు కోట్ల రూపాయలు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో ఏఈ నుంచి ఈఈ వరకు ప్రతి ఒక్కరికీ లక్ష్యాలు విధించారంటున్నారు. సొమ్ములివ్వని అధికారులపై చర్యలకు ఉపక్రమించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు కాంట్రాక్టర్లను పీడించి లంచాలు వసూలు చేసేవారని ఒకరు ఆరోపించారు. బిల్లు ఆమోదించాలంటే ఒక శాతం ముందుగానే ముట్టజెప్పాలి. విశాఖ ఎస్‌ఈ కార్యాలయం పరిధిలో ఇటీవల కోట్ల రూపాయిల బిల్లులు మంజూరుచేశారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఈ ఏడాది మార్చిలోగా మంజూరుకాకపోతే తిరిగి సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ ఆ విషయాన్ని కాంట్రాక్టర్లకు చెప్పలేదు. దీనిపై కొందరు కాంట్రాక్టర్లు ఇటీవల విశాఖ వచ్చిన మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదుచేశారు. కొసమెరుపు ఏమిటంటే..ఏసీబీకి పట్టించిన కాంట్రాక్టర్లు, ఈఎన్‌సీ శ్రీనివాస్ ఒకప్పుడు మంచి మిత్రులు. మిత్రులైనా పైసలు ఇవ్వకపోతే బిల్లు మంజూరుచేసేది లేదని తెగేసి చెప్పడంతో ఏసీబీకి పట్టించేంత వరకూ వెళ్లినట్టు తెలిసింది. కాగా ఏసీబీకి దొరికిన శ్రీనివాస్ వేధింపులు, అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని కూటమి పార్టీ సానుభూతిపరుడైన కాంట్రాక్టర్ ఒకరు వెల్లడించారు.

ఆక్వా రంగానికి ఊతం!

... 5వ పేజీ తరువాయి

రాయితీపై చర్చించారు. ఆక్వా జోన్‌ల పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే సరఫరా చేస్తారు. కొత్తగా ఆక్వా జోన్ల ఏర్పాటు, విద్యుత్ సబ్సిడీ ప్రకటనపై ఆయా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, ఆయా ఆక్వా జోన్‌లలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే చేపలు, రొయ్యల పెంపకం రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చాలని ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, VADAPALLI VENKATARAMANAMURTY (Old name) S/o. Vadapalli Suryanarayana, Resident of PNo-311, Sundar Sai RK DIK Apts, Chandrampalem, Visakhapatnam. Change my name from VADAPALLI VENKATARAMANAMURTY (Old Name) to VADAPALLI VENKATA RAMANA MURTHY (New Name) hence forth I am being called as VADAPALLI VENKATA RAMANA MURTHY (New Name) for all purposes.
AJV_241643

CHANGE OF NAME

★ I, MURIKI NAGAMUNI (Old Name), S/o. Mudiki Apparao, Resident of 3-127, Ambedkar Street, Narasapuarapu peta, Dr.B.R.Ambedkar Konaseema. Change my name from MURIKI NAGAMUNI (Old Name) to MUDIKI NAGAMUNI (New Name), henceforth I am being called as MUDIKI NAGAMUNI (New Name) for all purposes
AJV_241644

CHANGE OF NAME

★ I, MURIKI BHARATHI DEVI (Old Name), W/o. MUDIKI NAGAMUNI, Resident of 3-127, Ambedkar Street, Narasapuarapu Peta, Dr.B.R.Ambedkar Konaseema. Change my name from MURIKI BHARATHI DEVI (Old Name) to MUDIKI BHARATHI DEVI (New Name), henceforth I am being called as MUDIKI BHARATHI DEVI (New Name) for all purposes
AJV_241645

CHANGE OF NAME

★ I, BACHALA ANURADHA (Old Name) W/o. Konku Bangarraju, Resident of Q.No.430B/B, Sector-6, Steel Plant, Ukkunagaram, Visakhapatnam. Change my name from BACHALA ANURADHA (Old Name) to KONKU ANURADHA (New Name), henceforth I am being called as KONKU ANURADHA (New Name) for all purposes
AJV_241646

FINANCE

రిటైర్డ్ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగస్థులకు సులభవాయిదా పద్ధతిలో 5లక్షల లోపు ఫైనాన్స్ చేయబడును. స్థిరాస్థిపై బ్యాంకులో లోను తీసుకున్నవారికి కూడా జిరాక్స్ పేపర్స్‌పై సెకండ్ మార్టిగేజ్ లోన్ చేయబడును. సెల్: 9396999669
AJD-244810

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

క్రైం... crime news

అనారోగ్య కారణాలతో వృద్ధురాలి ఆత్మహత్య

కోటవురట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగోలేదని జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కోటవురట్ల ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం పీ రామన్నపాలెం గ్రామానికి చెందిన పల్లా సింహాచలం అలియాస్ చిలకమ్మ(66).. కుమారులు రామునాయుడు, వెంకునాయుడుతో కలిసి ఉంటోంది. ఆమె అనారోగ్యంతో కొన్నాళ్లుగా బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌కి వెళ్లి ఇనుప రాడ్డుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాత్‌రూమ్‌కి వెళ్లిన తల్లి ఎంతసేపటికి రాకపోవడంతో కుమారులు వెళ్లి తలుపులు విరగ్గొట్టి వెళ్లి చూశారు. తాడుకు వేలాడుతూ కనిపించడంతో కిందకు దించారు. ఆమె అప్పటికే మృతి చెంది ఉంది. ఈ విషయాన్ని ఎస్‌ఐ రమేశ్‌కు తెలియజేశారు. ఆయన కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలికి తీవ్ర గాయాలు అయ్యాయని ట్రాఫిక్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. నరసింగరావుపేటకు చెందిన కొడమంచిలి అచ్చియ్యమ్మ మెయిన్‌రోడ్డు మీదకు వస్తుండగా సబ్‌జైలుకు వెళ్లే జంక్షన్ వద్ద నర్సీపట్నం నుంచి విశాఖపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో అచ్చియ్యమ్మ తలకు, చేతికి బలమైన గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, ప్రథమ చికిత్సలు అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మూడు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

దేవరాపల్లి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శ్రీరాంపురం వై.జంక్షన్ వద్ద గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనంతగిరి మండలం పినకోట వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరి వద్ద వున్న బ్యాగును తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. విశాఖలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన చుక్కా కార్తీక్, సబ్బవరానికి చెందిన చిట్టి బోయిన ఎర్నిబాబుగా గుర్తించారు. వీరు అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ వేలంమామిడి గ్రామంలో పాడి అప్పన్న అనే గిరిజనుడి నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్టు నిందితులు వెల్లడించారు. గంజాయితోపాటు ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చోడవరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

గ్రావెల్ లారీ పట్టివేత

మునగపాక, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మునగపాక మీదుగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకున్నామని ఎస్.ఐ పి.ప్రసాదరావు తెలిపారు. గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో లారీ డ్రైవర్ గ్రావెల్‌కు సంబంధించిన ఆధారాలు ఏమీ చూపలేదన్నారు. దీంతో అక్రమ గ్రావెల్‌గా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. 9 మంది అరెస్టు

రావికమతం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో చీమలపాడు పంచాయతీ శివారు సీకే పాడు గిరిజన గ్రామ శివారున ఉన్న తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం కొత్తకోట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.37,330 నగదు స్వాధీనం చేస్తున్నారు. అనంతరం స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి పేకాట ఆడుతున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

25 డిఫెన్స్ మద్యం సీసాలు స్వాధీనం

నర్సీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామానికి చెందిన తమరాన అప్పలనాయుడు నుంచి 25 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలు తీసుకెళుతుండగా పెదబొడ్డేపల్లి శ్రీరామనగర్ కాలనీలో అరెస్టు చేసినట్టు చెప్పారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించామన్నారు. ఇతను గతంలో రెండు పర్యాయాలు డిఫెన్స్ మద్యంతో పట్టుబడినట్టు చెప్పారు.

సామాజిక కార్యకర్త నూకరాజుపై దాడి


గాయపడిన నూకరాజు

ఎస్.రాయవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సోమిరెడ్డి నూకరాజుపై గురువారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పెనుగొల్లు గ్రామంలో గొర్ల దేముడు అనే వ్యక్తి గోరక్షణ చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్నారు. ఆయన గోశాల ద్వారా పలు అక్రమాలకు పాల్పడుతున్నారంటూ సీఎం, డిప్యూటీ సీఎం, డీజీపీ, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఇటీవల సామాజిక కార్యకర్త సోమిరెడ్డి నూకరాజు విజయవాడ వెళ్లి ఫిర్యాదు చేశారు. అలాగే కలెక్టర్, ఎస్పీ, తహశీల్దార్, ఎస్‌ఐలకు ఫిర్యాదు అందజేశారు. అనంతరం గురువారం ఆయన ఎస్.రాయవరంలోని తన ఇంటికి రాగా సీసీ కెమెరాలు ధ్వంసమై ఉన్నాయి. మధ్యాహ్నం వాకపాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు వచ్చిన ఆయనకు తమ సమస్యను చెప్పుకుంటున్నారు. ఆ సమయంలో గోరక్షణ చారిటబుల్ ట్రస్టుకు చెందిన గొర్ల దేముళ్లు, గోకులపాడు గ్రామానికి చెందిన సమ్మంగి నానాజీ, మరో యువకుడు వచ్చి నూకరాజుపై దాడి చేశారు. ఆయన రెండు మొబైల్ ఫోన్లు, సీసీ కెమెరా ఫుటేజీ ఉన్న సీపీయూ తీసుకుని పరారయ్యారు. బాధితుడు నూకరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విభీషణరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడిని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

- డ్వామా పీడీ పూర్ణిమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమాదేవి

ఎలమంచిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. గురువారం ఎలమంచిలిలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎలమంచిలి మండలాలకు చెందిన ఏపీవోలు, ఈసీ, తదితర సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ విధానం వలన బినామీ మస్తర్లకు అవకాశం లేకుండా ఉంటుందన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో నిబంధనల ప్రకారం పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీలు ఎరకయ్య, మణికుమార్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504